# అంపకాలు

[గ ల్పిక]

బాబాయి ఊరికెళ్తున్నాడంటే ఈ సారి చిట్టికెందుకో పట్ట రానిదుఃఖం వచ్చింది. పెద్దవాళ్లతోబాటు తనుకూడా కళ్లల్లో వత్తులేసుక్కూచుంది—మామూలుగా దీపాలుపెట్టగానే నిద్ర పోయేది. చుట్టి బెల్టులుబిగించిన బాబాయి పరుపు, సర్ది తాళంవేసిన బాబాయిపెట్టె చూస్తూ ఎట్లానిద్దరపోవటం?

"నేనివాళపోనమ్మా. రేపునిద్దర లేచీ, చక్కగా మనిద్దరం మొహంకడుక్కునీ—" అని బాబాయి బుజ్జగిస్తున్నకొద్దీ చిట్టి బాబాయి మెడకుచేతులుపెనేసి, "ఉఁహుఁ! ఉఁహుఁ!" అని తల అడ్డంగా తిప్పుతూ కొంతసేపు మారాం చేసింది.

అమ్మ కోప్పడ్డది.

"బాబాయికి బరువుకాదు లే? చంకదిగు భడవాకానా! దిగుతావా, దిగవా?" అని అమ్మ ఉరిమింది.

నాన్నకూడా కోప్పడ్డాడు.

చిట్టిబావురుమన్నది. దాని కన్నీటితో బాబాయి మొహ మంతా తడిసింది. అతనికి ఈ ప్రేమను నమ్మాలోనమ్మరాదో తెలీలేదు. చిట్టాం అదివరకు తనమీద ఇంత ప్రేమచూపించి ఎరగదు. పోనీ, ఇదంతా వొట్టిమంకుతనం అనుకుందామంటే, ఆ కన్నీళ్లో?

పదికూడాకొట్టింది. ఇకబయిలుదేరకపోతే మెయిలందదు.

"ఇక దిగమ్మా, చిట్టీ! నేను మళ్లీవస్తాగా! నీకు మంచి మంచి బిస్కత్తులూ, పిప్పరమింటుబిళ్లలూ—"

చిట్టాం మళ్లీ బావురుమన్నది. బాబాయి ఇకపట్టలేకపోయి

నాడు. పిల్లను దగ్గరికితీసుకుని కళ్లనీళ్లుతుడిచి, ముద్దులాడి ఆఖరుకు బలవంతాన వదిలించుకుని బయలుదేరాడు. పోతూ, పోతూ, "పిల్లనేం అనకమ్మా, వొదినా!" అని హెచ్చరించాడు.

బాబాయివెళ్లిన పావుగంటదాకా చిట్టిఏడుపు తిరుగుమొహం కాలేదు. ఆఖరుకు ఏడుపు ఎక్కిళ్లుగానూ, ఎక్కిళ్లు నిద్రలోకీ ఉపశమించింది.

మాటలఅలికిడికి చిట్టిమేలుకున్నది—కాని కళ్లు తెరవలేదు. అందరూ ఒక్కసారిగా మాట్లాడుతున్నారు. అన్ని గొంతుల్లోనూ బాబాయిగొంతు స్పష్టంగావినిపిస్తున్నది చిట్టికి.

"మెయిలు ఏడుగంటలు లేటు. స్టేషన్లోఉండి ఏమిటి చెయ్యటం? మెయిలుకోసంవచ్చినవాళ్లంతా ఇళ్లకుతిరిగివెళ్లారు ..మళ్లాఏనాలుగింటికో లేచివెళతాను...చిట్టాం-పిచ్చిముండ! అప్పుడే నిద్రపోయి నట్టుందే?" అంటున్నాడు బాబాయి.

"పోయింది ఏడిచీఏడిచీ," అని తల్లి జవాబుచెబుతున్నది.

చిట్టికి కళ్లు తెరవాలని ఎంతమాత్రమూ లేదు. బాబాయి మొహం చూడటాని కెందుకో సిగ్గేసింది. బాబాయి తిరిగి రావటం చిట్టి కిష్టంలేదు. తనదుఃఖమంతా వృథాచేశాడు! తెల్లారుజామునకూడా మళ్లా చిట్టికి మెలుకువవచ్చింది. కాని అప్పుడుకూడా చిట్టి నిద్రపోతున్నట్టే కదలకుండా పడుకున్నది.

మళ్లారైలుకు వెళ్లబోతూ, "చిట్టామను లేపనా?" అన్నాడు బాబాయి నవ్వుతూ. నిజంగా లేపుతాడేమోనని చిట్టికి తగనిభయం వేసింది.

"ఇంకానయం!" అనితల్లనేదాకాచిట్టాం ప్రాణంకుదటపళ్లే.